RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:110 | ఏప్రిల్ 18, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



### సచివాలయంలో ఉద్యోగుల మహా ధర్నా

సమస్యల పరిష్కారం కోరుతూ నల్ల రిబ్బన్లతో నిరసన

2లో




# జూన్ 2 డెడ్‌లైన్!

## రేవంత్ సర్కార్‌పై పోరుబాట

### పెండింగ్ సమస్యలపై ఉద్యోగుల సమర శంఖం

- తెలంగాణవ్యాప్తంగా మిన్నంటిన నిరసన జ్వాలలు
- పీఆర్సీ అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం
- వృద్ధాప్యంలో తప్పని పెన్షనర్ల తిప్పలు
- పాత పెన్షన్ విధానంపై వెనక్కి తగ్గేదే లేదన్న ఉపాధ్యాయ లోకం
- హెల్త్ కార్డుల అమలులో విఫలం.. కార్పొరేట్ వైద్యం అందక విలవిల
- బదిలీల జాప్యంపై భగ్గుమన్న టీచర్లు
- సాధారణ బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్
- ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేసిన ఉద్యోగ సంఘాలు

2లో




**వేద న్యూస్, ఎల్.కే (ప్రత్యేక ప్రతినిధి)**

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ మరియు పెన్షనర్ల గళం ఒక్కసారిగా ఉప్పెనలా మారింది. తెలంగాణ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాల్లో నిరసన జ్వాలలు మిన్నంటాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురవుతోందని, రేవంత్ సర్కార్‌పై ఉద్యోగులు ఇప్పుడు సమర శంఖం పూరించారు. పీఆర్సీ అమలుపై జూన్ 2 వరకు డెడ్ లైన్ విధించడమే కాకుండా, పెండింగ్ బకాయిలు, పాత పెన్షన్ పునరుద్ధరణ వంటి కీలక డిమాండ్లతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. హామీలు నెరవేర్చకపోతే సమ్మెకు సైతం వెనుకాడబోమని జేఏసీ నేతలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో, రాష్ట్రంలో అధికార యంత్రాంగం వర్సెస్ ఉద్యోగుల మధ్య పోరాటం పతాక స్థాయికి చేరింది.



తెలంగాణ ధాన్యం సేకరణపై

### కేంద్రంతో సీఎం భేటీ

- 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరణకు విజ్ఞప్తి
- కేంద్ర మంత్రి సూత్రప్రాయ అంగీకారం
- పాత బకాయిలు విడుదల చేయాలని కోరిన సీఎం
- పాఠశాలలు, వసతిగృహాల్లో పోషకాహార బియ్యం పంపిణీ ప్రారంభించాలని విన్నపం

2లో



తేజస్వి సూర్య

### దిష్టిబొమ్మ దహనం

- లోక్‌సభలో వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం
- తెలంగాణ భవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన
- బీజేపీ ఎంపీలు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్

2లో

కాళేశ్వరం పునరుద్ధరణకు

## సమన్వయ కమిటీ

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కీలక నిర్ణయం
- కల్నల్ పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ
- జూన్ నాటికి పరీక్షలు పూర్తి చేయాలని గడువు
- ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా మరమ్మతులు



**వేద న్యూస్, హైదరాబాద్**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం మరియు సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక అడుగు వేసింది. ఈ బ్యారేజీల రక్షణ మరియు పటిష్టతను పునరుద్ధరించడానికి ఒక సమన్వయ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు

మిగతా 2వ పేజీలో

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు బ్రేక్!

### 298 అనుకూలం.. 230 వ్యతిరేక ఓట్లు

- డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లు రెండింటినీ వెనక్కి తీసుకున్న కేంద్రం
- మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేకపోయిన ఎన్డీఏ
- హఠాత్ పరిణామాల మధ్య సభలో గందరగోళం
- లోక్‌సభను వాయిదా వేసిన స్పీకర్
- ప్రభుత్వం తదుపరి అడుగుపై దేశవ్యాప్తంగా మొదలైన చర్చ
- 2029 ఎన్నికల్లో ప్రశ్నార్థకంగా మహిళా కోటా అమలు



**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

మహిళా రిజర్వేషన్ల అమలు దిశగా వేగంగా అడుగులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో చుక్కెదురైంది. మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లభించకపోవడంతో ఆ బిల్లు వీగిపోయింది. శుక్రవారం సభలో జరిగిన ఓటింగ్ సందర్భంగా అధికార ఎన్డీఏ కూటమి ఆశించిన స్థాయిలో సభ్యుల మద్దతును కూడగట్టలేకపోయింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం కోటా కల్పించే ప్రక్రియలో

మిగతా 2వ పేజీలో

## తెలంగాణ ధాన్యం సేకరణపై
# కేంద్రంతో సీఎం భేటీ

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

తెలంగాణ రాష్ట్రంలో యాసంగి పంటకు సంబంధించి ధాన్యం సేకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో కీలక చర్చలు జరిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి, రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. యాసంగి కాలంలో పండే ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు ఎంతో అనుకూలమని, గత ఆరు సీజన్ల గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని కేంద్ర మంత్రికి వివరించారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు ప్రస్తుతం భారీ డిమాండ్ ఉన్నందున, సరఫరా పెంచాలని గతంలో కేంద్ర అధికారులు సూచించిన విషయాన్ని ఈ సమావేశంలో ముఖ్యమంత్రి గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో సుమారు 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), మరో 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బాయిల్డ్ రైస్ సేకరణకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ధాన్యం సేకరణతో పాటు రాష్ట్రానికి రావాల్సిన సుదీర్ఘ కాలపు బకాయిల అంశాన్ని కూడా ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. 2014–15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించి నిలిచిపోయిన రూ. 1,468.94 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. దేశంలోనే ధాన్యం ఉత్పత్తి మరియు సేకరణలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోందని, రైతుల నుంచి ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే నగదు చెల్లింపులు చేస్తున్నామని వివరించారు

## తేజస్వి సూర్య దిష్టిబొమ్మ దహనం

**వేద న్యూస్, హైదరాబాద్**

లోక్‌సభ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన అనుచిత వ్యాఖ్యలు రాష్ట్రంలో రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలకు నిరసనగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు శుక్రవారం తెలంగాణ భవన్ సమీపంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. తేజస్వి సూర్య తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడారని మండిపడుతూ, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీకి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేయడంతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్తంగా మారింది. తెలంగాణ ప్రజల దశాబ్దాల పోరాటాన్ని, బలిదానాలను అవమానించేలా బీజేపీ ఎంపీలు వ్యవహరిస్తున్నారని నిరసనకారులు ధ్వజమెత్తారు. బీజేపీ ఎంపీలారా ఖబడ్దార్ అంటూ హెచ్చరికలు జారీ చేస్తూ, కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. రాష్ట్ర ఏర్పాటుపై పదే పదే విషం చిమ్మడం బీజేపీకి అలవాటుగా మారిందని, ఇది తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు సాక్షిగా జరిగిన ఈ అవమానంపై రాష్ట్రంలోని ప్రతి పౌరుడు ఆగ్రహంతో ఉన్నారని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్ గౌడ్, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను తప్పుబట్టడం అంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు. తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు బ్రేక్!

**మొదటి పేజీ తరువాయి**

ఈ సవరణ బిల్లు అత్యంత కీలకం కాగా, తాజా పరిణామం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. ఈ కీలక బిల్లుపై లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 352 మంది సభ్యుల మద్దతు (మూడింట రెండొంతులు) అవసరం కాగా, బిల్లుకు అనుకూలంగా కేవలం 298 ఓట్లు మాత్రమే పడ్డాయి. అదే సమయంలో 230 మంది సభ్యులు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అవసరమైన సంఖ్య కంటే 54 ఓట్లు తక్కువగా రావడంతో స్పీకర్ బిల్లు వీగిపోయినట్లు ప్రకటించారు. మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, సభలో తగిన బలం నిరూపించుకోలేకపోవడం గమనార్హం. ఈ బిల్లు వీగిపోవడం వల్ల దేశవ్యాప్తంగా జరగాల్సిన డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియపై తీవ్ర ప్రభావం పడనుంది. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్ తర్వాతే అమలు చేయాలని గతంలోనే చట్టం నిర్దేశించిన నేపథ్యంలో, తాజా సవరణ విఫలమవ్వడం వల్ల నియోజకవర్గాల విభజన కమిషన్ ఏర్పాటులో జాప్యం జరగనుంది. దీనితో పాటు పుదుచ్చేరి వంటి కేంద్రపాలిత ప్రాంతాల్లో మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ఉద్దేశించిన చట్ట సవరణలను కూడా కేంద్రం వెనక్కి తీసుకుంటున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి సభలో ప్రకటించారు. చారిత్రాత్మకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో ప్రతిపక్షాలు మరియు అధికార పక్షం మధ్య ఉన్న భేదాభిప్రాయాలు ఈ ఓటింగ్ ద్వారా మరోసారి బయటపడ్డాయి. ఓటింగ్ ముగిసిన వెంటనే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి జోక్యం చేసుకుంటూ, సంబంధిత ఇతర బిల్లులను కూడా ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. ఈ హఠాత్ పరిణామాల మధ్య సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ లోక్‌సభను వాయిదా వేశారు.

## కాళేశ్వరం పునరుద్ధరణకు సమన్వయ కమిటీ

**మొదటి పేజీ తరువాయి**

జారీ చేసింది. గత కొంతకాలంగా ఈ బ్యారేజీల పటిష్టతపై తలెత్తిన అనుమానాలు సాంకేతిక సమస్యల నేపథ్యంలో, శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నీటి పారుదల రంగంలో నిపుణులైన అధికారులతో కూడిన ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించనుంది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు ఈ మూడు బ్యారేజీల్లో జియో–ఫిజికల్ జియో–టెక్నికల్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం నీటి పారుదల శాఖ టన్నెల్స్ – సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ బ్యారేజీల పునాదుల పటిష్టతను భూగర్భ పరిస్థితులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విశ్లేషించనుంది. ఈ పరీక్షల ద్వారా వెల్లడయ్యే ఫలితాల ఆధారంగా బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన తుది ప్రణాళికను సిద్ధం చేయనున్నారు. ప్రాజెక్టు భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని ప్రభుత్వం భావిస్తోంది. సెంట్రల్ వాటర్ కమిషన్ ఎన్డీఎస్ఏ ఆమోదించిన డిజైన్ల ప్రకారం పునరుద్ధరణ పనులను ప్రారంభించడానికి ఈ కమిటీ ప్రభుత్వానికి సత్వరం నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన సాంకేతిక అనుమతులను పొందడం మరియు పనుల నాణ్యతను పర్యవేక్షించడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. బ్యారేజీల నిర్మాణంలో దొర్లిన లోపాలను సరిదిద్ది, భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నివేదిక ఆధారంగానే కాళేశ్వరం ప్రాజెక్టు పునర్వైభవంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. రాబోయే వర్షాకాలం దృష్ట్యా పునరుద్ధరణ పనుల విషయంలో ప్రభుత్వం గడువును కూడా ఖరారు చేసింది. జూన్ 2026 నాటికి, అంటే వర్షాకాలం ప్రారంభం అయ్యేలోపు జియో–ఫిజికల్ జియో–టెక్నికల్ పరీక్షలను పూర్తి చేయాలని కమిటీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# జూన్2 డెడ్‌లైన్!

## పెండింగ్ సమస్యలపై ఉద్యోగుల సమర శంఖం

- తెలంగాణవ్యాప్తంగా మిన్నంటిన నిరసన జ్వాలలు
- పీఆర్సీ అమలు చేయకపోతే ఆందోళనలు ఉధృతం
- వృద్ధాప్యంలో తప్పని పెన్షనర్ల తిప్పలు
- పాత పెన్షన్ విధానంపై వెనక్కి తగ్గేదే లేదన్న ఉపాధ్యాయ లోకం
- హెల్త్ కార్డుల అమలులో విఫలం.. కార్పొరేట్ వైద్యం అందక విలవిల
- బదిలీల జాప్యంపై భగ్గుమన్న టీచర్లు
- సాధారణ బదిలీల ప్రక్రియ వెంటనే చేపట్టాలని డిమాండ్
- ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేసిన ఉద్యోగ సంఘాలు

**వేద న్యూస్, ఎల్.కే (ప్రత్యేక ప్రతినిధి)**

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురవుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, మౌఖికంగా వెల్లడించిన హామీలు నేటికీ కాగితాలకే పరిమితమయ్యాయని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు క్షేత్రస్థాయిలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పెండింగ్ బకాయిలు, పీఆర్సీ అమలు, పాత పెన్షన్ విధానం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేస్తున్నారు.




### సర్కార్ కు జేఏసీ డెడ్ లైన్

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో కొత్త పీఆర్సీ అమలు అత్యంత కీలకమైనది. గత కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న పీఆర్సీని ఈ ఏడాది జూన్ 2వ తేదీ నాటికి ఖచ్చితంగా అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు అల్టిమేటం జారీ చేశాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన సవరణ జరగకపోతే ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి దిగజారుతుందని, ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు.

### పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం..

జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించి పదవీ విరమణ పొందిన పెన్షనర్ల పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఉద్యోగ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్, పెండింగ్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి, వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

### హెల్త్ కార్డులు.. సీపీఎస్ రద్దుపై పోరాటం

ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం జారీ చేసిన హెల్త్ కార్డులు ప్రస్తుతం చాలా చోట్ల నామమాత్రంగానే మిగిలాయి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందడం లేదని, హెల్త్ కార్డులను తక్షణమే పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరుతున్నారు. మరోవైపు, ఉద్యోగుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ముఖ్యంగా 2004 సెప్టెంబర్ 1వ తేదీ కంటే ముందు నియామక ప్రక్రియ ప్రారంభమైన వారందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలని వారు పట్టుబడుతున్నారు.

### డీఏ బకాయిలు, బదిలీల కోసం

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. అలాగే, ఉపాధ్యాయులు మరియు ఉద్యోగులకు సంబంధించిన సాధారణ బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న వారికి, బదిలీల కోసం ఎదురుచూస్తున్న వారికి ఈ నిర్ణయం ఊరటనిస్తుందని వారు పేర్కొన్నారు.

### వీఆర్ఏల సమస్యలు, ఉద్యోగుల భద్రతా కార్పొరేషన్

గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 61 ఏళ్లు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని నిరసనకారులు కోరారు. అలాగే, బడ్జెట్‌లో ఉద్యోగుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, తద్వారా ఉద్యోగులందరికీ సామాజిక మరియు ఆర్థిక భద్రత కల్పించాలని వారు సూచించారు.

## ప్రభుత్వం దిగిరాకపోతే..

ప్రభుత్వానికి ఇచ్చిన గడువులోగా సమస్యల పరిష్కారానికి దిగిరాకపోతే, పోరాటాన్ని మరో స్థాయికి తీసుకెళ్తామని డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ వి. లచిరెడ్డి, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మరియు జేఏసీ సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ సంయుక్తంగా హెచ్చరించారు. ప్రభుత్వం కేవలం హామీలకే పరిమితం కాకుండా, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తక్షణమే ఒక సమగ్రమైన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. కేవలం మాటలతో సరిపెట్టే కాలం చెల్లిపోయిందని, తమ న్యాయమైన కోర్కెలను తీర్చడంలో జాప్యం చేస్తే మండల స్థాయి నుంచి రాష్ట్ర రాజధాని వరకు నిరసన జ్వాలలను మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. అవసరమైతే విధులను బహిష్కరించి సమ్మెకు కూడా వెనుకాడబోమని, తమ హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని రేవంత్ సర్కార్‌పై వారు సమర శంఖం పూరించారు.

## అలంకార ప్రాయంగా
# క్రీడా ప్రాంగణాలు



**వేద న్యూస్, రుద్రూర్**

గ్రామీణ యువతకు క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అయితే పలుచోట్ల బోర్డులు మాత్రమే ఏర్పాటు చేసి వదిలేయడంతో అవి నిరుపయోగంగా మారిపోయాయి. రుద్రూర్ మండలంలోని రాయకూర్, సిద్దాపూర్, రాణంపల్లి వంటి గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చాలా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఊరికి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల యువకులు, విద్యార్థులు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. దాంతో మైదానాలు వెలవెలబోతూ ఖాళీగా కనిపిస్తున్నాయి.

### నిర్వహణ లేక ప్రజాధనం వృథా

ప్రతి క్రీడా ప్రాంగణం కోసం సుమారు రూ.25 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు చేసినప్పటికీ, సరైన నిర్వహణ లేక ప్రజాధనం వృథా అవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన మైదానాలు ప్రస్తుతం ఉపయోగం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాల కారణంగా పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి ప్రాంగణాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆటలకు అనుకూలంగా లేకపోవడంతో క్రీడాకారులు అక్కడికి వెళ్లడం మానేశారు.

### కనిపించని పరికరాలు

క్రీడాకారులకు అవసరమైన పరికరాలు అందించినప్పటికీ, ప్రస్తుతం అవి కనిపించని పరిస్థితి ఉంది. మైదానాల్లో ఆటలు జరిగిన ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడలను కూడా గ్రామ క్రీడా ప్రాంగణాల్లో కాకుండా ఇతర ప్రాంగణాల్లో నిర్వహించడం, ఈ మైదానాల అసలు పరిస్థితిని బహిర్గతం చేస్తోంది. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను పునరుద్ధరించి, యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.




- బోర్డులు మాత్రమే.. వినియోగం శూన్యం
- నిర్వహణ లేక ప్రజాధనం వృథా
- పిచ్చి మొక్కలతో కప్పబడిన మైదానాలు
- ఊరికి దూరంగా ఉండటంతో యువత నిర్లక్ష్యం
- కనిపించని ఆట పరికరాలు
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

## సచివాలయంలో ఉద్యోగుల మహా ధర్నా
### సమస్యల పరిష్కారం కోరుతూ నల్ల రిబ్బన్లతో నిరసన



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ సచివాలయంలో మహా ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. సచివాలయంలో పనిచేసే ఉద్యోగులందరూ నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరై తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుపై ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తిని ఈ ధర్నా ద్వారా బహిర్గతం చేశారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగ సంఘాల నేతలు ఈ సందర్భంగా హెచ్చరించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో సచివాలయ ప్రాంగణంలో ఉద్యోగులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. వందలాది మంది ఉద్యోగులు ఏకమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యంగా 52 శాతం ఫిట్మెంట్‌తో కూడిన కొత్త పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతన సవరణ జరగడం లేదని, దీనివల్ల ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, బకాయిలను క్లియర్ చేయాలని ఉద్యోగులు గట్టిగా కోరారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని జేఏసీ నాయకులు మండిపడ్డారు. హెల్త్ స్కీంను సమర్థవంతంగా అమలు చేయాలని, నగదు రహిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు మరియు ఇతర అలవెన్సులను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని, కేవలం హామీలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపాలని హితవు పలికారు. సచివాలయ ఉద్యోగులు ఒకే తాటిపైకి వచ్చి సాగిస్తున్న ఈ పోరాటం ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. ఈ నిరసనలో ప్రధానంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు అంశం ప్రముఖంగా వినిపించింది. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని ఉద్యోగులు పట్టుబట్టారు. పదవీ విరమణ తర్వాత సామాజిక భద్రత కల్పించడంలో పాత పెన్షన్ విధానమే ఉత్తమమని వారు అభిప్రాయపడ్డారు.

# చిన్నారుల భవిష్యత్తే రాష్ట్ర అభివృద్ధికి పునాది



**– కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

వరంగల్ జిల్లాలోని శంభునిపేట, గుంటూరుపల్లి ప్రాంతాల్లోని అంగన్వాడి కేంద్రాలను శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలపై.కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గుంటూరుపల్లి అంగన్వాడి భవన నిర్మాణాన్ని తుది మెరుగులతో త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని, అలాగే కాంపౌండ్ గోడ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శంభునిపేట అంగన్వాడి కేంద్రంలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించి చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక వసతులు, శుభ్రత, హాజరు నమోదులను కూడా పరిశీలించి, అవసరమైన మెరుగుదల చేపట్టాలని అధికారులను ఆదేశించారు.బాల్యవివాహాల నియంత్రణలో మహిళలు ముందుండి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఆడపిల్ల డిగ్రీ వరకు తప్పనిసరిగా చదువుకోవాలని, విద్య ద్వారా వారి ఆలోచనా శక్తి పెరిగి భవిష్యత్తును మెరుగ్గా నిర్మించుకునే సామర్థ్యం ఏర్పడుతుందని తెలిపారు. ఈ అంశంపై అంగన్వాడి కార్యకర్తలు గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, సంబంధిత శాఖల అధికారులు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# మీనాక్షి నటరాజన్‌ను కలిసిన అడువ మహేష్

**– నామినేటెడ్ పదవి కోరిన నేత**

**– సానుకూలంగా స్పందించిన పార్టీ ఇంచార్జి**



**వేద న్యూస్, హైదరాబాద్:**

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను హైదరాబాద్‌లో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అడువ మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచనల మేరకు జరిగింది. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. తాను గత 26 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానని, అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ కార్యకలాపాలను నిరంతరం ముందుకు తీసుకెళ్లినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో తనపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవి ఇవ్వాలని మీనాక్షి నటరాజన్‌ను కోరగా, ఆమె సానుకూలంగా స్పందించి పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సౌరం అభిలాష్, కోగిల సుధాకర్, పులిచెరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

**– తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఉద్యోగ సంఘాలు**



**వేద న్యూస్, శాయంపేట:**

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంయుక్త చర్యా కమిటీ పిలుపు మేరకు శాయంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంయుక్త చర్యా కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వొడ్నాల రాజశేఖర్ ఆధ్వర్యంలో అనేక సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఇంకా చాలావరకు పెండింగ్‌లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బిల్లులను వెంటనే చెల్లించడంతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య కార్డులు జారీ చేసి అమలు చేయాలని కోరారు. సహకార పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్ వచ్చిన వారికి పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 61 సంవత్సరాలు పూర్తి చేసిన గ్రామ సేవకుల వారసుల నియామక సమస్యను పరిష్కరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. జనాభా లెక్కల కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు చేపట్టాలని, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లుల కోసం నిరసన

**– మాజీ సర్పంచ్ దంపతుల అరెస్ట్**

**– వల్లంపట్లలో ఉద్రిక్త పరిస్థితి**



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో పెండింగ్ బిల్లుల సమస్యతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేతిరెడ్డి అనసూయ స్వంత ఖర్చుతో సుమారు రూ.22 లక్షలు వెచ్చించి పాఠశాల భవనాలు నిర్మించినప్పటికీ, వాటికి సంబంధించిన బిల్లులు ఏడాది కాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. పలుమార్లు అధికారులను సంప్రదించినా స్పందన లేకపోవడంతో నిరసనకు దిగారు. బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్ దంపతులు పాఠశాలకు తాళం వేసి నిరసన చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని అనసూయతో పాటు ఆమె భర్తను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**వేద న్యూస్, నల్లబెల్లి :**

తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ... తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శుక్రవారం నల్లబెల్లి మండలంలో టీజీ ఈజెఏసి ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నల్లబెల్లి తహసిల్దార్ ఆఫీస్ ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నేతలు మాట్లాడారు. జూన్ 2 వరకు పీఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను 2 విడతల్లో చెల్లించాలని, మే 1 నుండి హెల్త్ కార్డు విధానాన్ని అమలు పర్చాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు పరచాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు తక్షణమే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. నల్లబెల్లి మండల తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో తహసిల్దార్ గారికి మెమోరండం ఇచ్చారు. అంతకు ముందు సీపీ ఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు, పీఆర్సీ ప్రకటించాలి అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టిఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉడుత రాజేందర్, భానోత్ కృష్ణ డిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కందుల గోవర్ధన్, పూజారి రవి, యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.రాజిరెడ్డి, జి.అశోక్, తెలంగాణ పిఆర్టియు మండల అధ్యక్షులు దస్రు, ఉపాధ్యాయులు కర్ణకంటి రామ్మూర్తి, కునమల్ల రాజన్ బాబు, మండలంలోని వంద మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అధికారులకు భూయజమానుల బహిరంగ లేఖ

**– నాలా సమస్యకు పరిష్కారం చేయాలని డిమాండ్**



**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్లలో వాసవి కళ్యాణ మండపం సమీపంలో ఉన్న నాలా సమస్యపై భూయజమానులు మున్సిపల్ అధికారులకు బహిరంగ లేఖ విడుదల చేశారు. ప్రజల అవసరాల కోసం తాత్కాలికంగా అనుమతించిన నాలాను శాశ్వతంగా మార్చకుండా తమ స్థలంలోనే కొనసాగించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. శాశ్వత పరిష్కారం చేస్తామని పలుమార్లు హామీలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని భూయజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు కూడా నష్టపరిహారం ఇచ్చి పనులు ప్రారంభించాలని సూచించినప్పటికీ అధికారులు అమలు చేయలేదన్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం మాట నమ్మి భూమిని ఇచ్చినప్పటికీ డ్రైనేజీ, రహదారి నిర్మాణాలు చేపట్టకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కచ్చ రోడ్డు అయినా వేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఇకపై తమ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని నాళను మూసివేస్తామని, అధికారులు అడ్డుకోవద్దని స్పష్టం చేశారు. సమస్యపై ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రోడ్డు భద్రతపై మాక్ డ్రిల్

**– సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**


**– ప్రమాదాల సమయంలో స్పందనపై ప్రాక్టికల్ శిక్షణ**



**వేద న్యూస్, శాయంపేట:**

అరైవ్ అలైవ్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శాయంపేట మండలం మందారిపేట సెంటర్‌లో రోడ్డు భద్రతపై ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిఐ రంజిత్ రావు, ఎస్ఐ జక్కుల పరమేష్ పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు ఎలా స్పందించాలి, అత్యవసర సేవలకు ఎలా సమాచారం ఇవ్వాలి, బాధితులకు ధైర్యం చెప్పడం, రక్తస్రావం జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందించడం వంటి అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. గాయపడిన వారిని సురక్షితంగా ఆసుపత్రికి తరలించే విధానం, ప్రమాదం జరిగిన మొదటి గంట 'గోల్డెన్ అవర్' ప్రాధాన్యతను వివరించారు. సరైన సమయంలో చికిత్స అందితే ప్రాణాలు కాపాడవచ్చని సూచించారు. అదేవిధంగా ప్రమాద బాధితులకు సహాయం చేసే పౌరులను ప్రోత్సహించే పథకాలు, వారికి లభించే సాయం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వాహనదారులు, యువత పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆపన్నహస్తం



**వేద న్యూస్, వరంగల్ :**

గీసుకొండ మండల కేంద్రానికి చెందిన షేక్ అంకూస్ పాషా (షరీఫ్) అనే నిరుపేద ఆటోడ్రైవర్ రెండు నెలల క్రితం హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పటల్ లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అకస్మాత్తుగా ఇంటి యజమాని అనారోగ్యం బారినపడగా ట్రీట్మెంట్ కు మరియు కుటుంబ పోషణకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇట్టి విషయాన్ని గీసుకొండ కి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కర్ణకంటి రాంమూర్తి, తాడ్వాయి మండలం, కాటాపూర్ హైస్కూల్ కు చెందిన తన పూర్వ విద్యార్థి అయిన నామని రమేష్ దృష్టికి తీసుకెళ్లి, తోచినంత సహకారం అందజేయాలని కోరగా తన జీవిత భాగస్వామి పుట్టినరోజు సందర్భంగా రూ.5000 ల ఆర్థిక సహాయాన్ని ఫోన్ పే ద్వారా పంపగా, అట్టి నగదును బాధితునికి అందజేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంకన్న మించిన వేడుక మరేదీలేదని పేర్కొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరసన

**– తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన**



**వేద న్యూస్, పోతంగల్:** పోతంగల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీజీఈ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించి, తహసీల్దార్ విష్ణుకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం ఏప్రిల్ 18, 2026

# ఎంపీ తేజస్వి తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

**– పార్లమెంట్ వద్ద ఖమ్మం ఎంపీ నిరసన**




**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన రాష్ట్ర విభజన వ్యాఖ్యలను ఖండిస్తూ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలతో కలిసి పార్లమెంట్ వద్ద నిరసన చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్తాన్ విభజనతో పోల్చడం తీవ్ర అభ్యంతరకరమని, ఇలాంటి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తాయని ఆయన అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా వెనక్కు తీసుకోవాలని, అవి తెలంగాణ అమరవీరుల త్యాగాలను అవమానపరచడమేనని పేర్కొన్నారు. పార్లమెంట్ రికార్డుల నుంచి ఈ వ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ క్షమాపణలు చెప్పాలి , తెలంగాణ ప్రజల భావాలను గౌరవించాలి అంటూ నినాదాలు చేశారు.

# గిరిజన భూములపై వివాదం

**– సింగరేణి, అటవీ అధికారులపై ఆరోపణలు – టేకులగూడెంలో ఉద్రిక్తత**



**వేద న్యూస్, కారేపల్లి:**

గిరిజనులకు రెవెన్యూ పట్టాలు ఉన్నప్పటికీ భూములపై హక్కులు నిరాకరిస్తున్నారని ఆరోపిస్తూ టేకుల గూడెం గ్రామంలో ఉద్రిక్త పరి స్థితులు నెలకొన్నాయి. సింగరేణి సంస్థ, అటవీ అధికారుల చర్యలను వెంటనే నిలిపివేయాలని గ్రామ సర్పంచ్ గుమ్మడి సందీప్ డిమాండ్ చేశారు. ఏళ్లుగా సాగుచేస్తున్న భూములపై సుమారు 30 మంది గిరిజన రైతులకు చెందిన 20 ఎకరాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఓపెన్‌కాస్ట్ పనులు నిలిపివేసిన సంస్థ మళ్లీ భూములు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించడం అన్యాయమని విమర్శించారు. గిరిజనుల హక్కులను కాపాడే చట్టాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని, గ్రామసభ అనుమతి లేకుండా భూములపై చర్యలు తీసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ఆ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రహదారిని మూసివేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఇది ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని గిరిజనుల భూములను రక్షించడంతో పాటు రహదారి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో స్థానిక నాయకులు, గిరిజన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు లేనిదే రాజ్యం లేదు

- ప్రతి గింజకూ మద్దతు ధర హామీ
- మధ్యవర్తులను ఆశ్రయించవద్దు
- ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**వేద న్యూస్, కారేపల్లి:**

రైతు లేనిదే రాజ్యం లేదని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. ప్రతి గింజకు మద్దతు ధర అందిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం సింగరేణి మండలం మాదారం గ్రామంలో కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు మధ్యవర్తుల వద్ద పంటను అమ్మి నష్టపోకూడదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర అందిస్తున్నామని, రైతులకు న్యాయమైన ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పంట కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులు ధైర్యంగా తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రాధాన్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై నిరసన

**– జీతాలు, పదోన్నతులపై చర్యలు కోరుతూ ఆందోళన**



**వేద న్యూస్, కారేపల్లి:**

మండల కేంద్రంలోని విశ్వనాథపల్లి గ్రామంలో ఉపాధ్యాయులు తమ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో జెడ్పి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ జీతాల బకాయిలు, పదోన్నతులు, సేవా సమస్యలు వంటి అంశాలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ నిరసనలో ఉపాధ్యాయులు ఐక్యంగా పాల్గొని తమ డిమాండ్లను వినిపించగా, స్థానిక ప్రజలు వారికి మద్దతు తెలిపారు.

# ఖమ్మం ఐడీఓసీలో ఉద్యోగుల నిరసన

- నల్ల బ్యాడ్జీలతో ఆందోళన
- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం హెచ్చరిక



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సంయుక్త వేదిక ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం లేకుండా ప్రభుత్వ పరిపాలన సక్రమంగా సాగదని, సుమారు లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ, కరువు భత్య బకాయిల విడుదల, పాత పెన్షన్ విధానం అమలు, ఆరోగ్య సదుపాయాల సమస్యల పరిష్కారం వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సామాజిక సేవతో 'మేడి'కి గుర్తింపు

**– డీజీపీ చేతుల మీదుగా ప్రశంస పత్రం**



**వేద న్యూస్, గంగాధర:**

కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణ, బాధితులకు తక్షణ సహాయం అందించిన వ్యక్తులను సన్మానించారు. ఈ సందర్భంగా గంగాధర మండలం మధురానగర్‌కు చెందిన ఆర్టీవీ జర్నలిస్టు మేడి ప్రసాద్‌ను రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి సన్మానించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన ఆయన సేవలను డీజీపీ అభినందించారు. మేడి ప్రసాద్‌కు శాలువ కప్పి ప్రశంసాపత్రం అందజేయగా, కరీంనగర్ పోలీస్ కమిషనర్ కూడా ఆయన సేవలను కొనియాడారు. తన సేవలను గుర్తించి సన్మానించిన పోలీస్ ఉన్నతాధికారులకు మేడి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన

**– వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చిన అగ్నిమాపక అధికారులు**




**వేద న్యూస్, బోధన్:**

బోధన్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బందికి అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా స్పందించాలి, ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సమయోచితంగా స్పందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర అధికారి కే. సుభాష్, సిబ్బంది నర్సయ్య, మహ్మద్ నజీమ్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కారించాలి

**– తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీజీఈజేఏసీ నిరసన**



**వేద న్యూస్, కారేపల్లి:**

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసీ సింగరేణి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పిలుపు మేరకు జరుగుతున్న దశలవారీ పోరాటంలో భాగంగా ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రెండో వేతన సవరణ కమిషన్ నివేదికను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నెలకు వందల సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ పొందుతుండటంతో బకాయిల భారం పెరుగుతోందని తెలిపారు. అలాగే ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య కార్డులు మంజూరు చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని, సహకార పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. 2004 సెప్టెంబర్ 1కు ముందు నియమితులైన వారికి వెంటనే పాత విధానం అమలు చేయాలని స్పష్టం చేశారు. మొత్తం పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నిరసన కొనసాగుతుందని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెస్ విలీనం కుట్రపూరిత నిర్ణయం

- కృష్ణయ్య కమిటీ నివేదిక ఎందుకు బహిర్గతం చేయరు?
- సెస్ ఉనికిని కాపాడేందుకు పోరాటం
- చైర్మన్ చిక్కాల రామారావు



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

లాభాల్లో నడుస్తున్న సెస్‌ను భారీ నష్టాల్లో ఉన్న టీజీ ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేయడం కుట్రపూరిత నిర్ణయమని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు విమర్శించారు. ఇది సెస్‌ను ప్రైవేటీకరించడానికి చేస్తున్న ప్రయత్నమని ఆరోపించారు. సిరిసిల్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 56 ఏళ్ల చరిత్ర కలిగిన సెస్ సంస్థ, 400కి పైగా ఉద్యోగుల భవిష్యత్తును రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెడుతున్నారని అన్నారు. కృష్ణయ్య కమిటీ నివేదిక ఇచ్చి 16 సంవత్సరాలు గడిచినా దానిని బహిర్గతం చేయకపోవడం వెనుక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. సెస్‌కు రావాల్సిన బకాయిల్లో పెద్ద మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిపారు. సెస్‌ను లాభాల బాటలో నడిపినప్పటికీ పాలకవర్గంపై ఒత్తిడి తెస్తున్నారని, సంస్థ ఉనికిని కాపాడేందుకు అవసరమైతే రాజీనామా చేయడానికి సిద్ధమని చెప్పారు. విలీనంపై అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామని స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- నల్ల బ్యాడ్జీలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన





**వేద న్యూస్, కోటగిరి:**

కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్టియు మండల అధ్యక్షుడు బర్ల సాయిలు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీజీఈ జేఏసీ పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేసినట్లు తెలిపారు. వేతన సవరణ, సీపీఎస్ రద్దు, ఆరోగ్య భీమా వంటి ప్రధాన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన

- నల్ల బ్యాడ్జీలతో ఆందోళన
- డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్



**వేద న్యూస్, రుద్రూర్:**

టీజీఈజేఏసీ పిలుపు మేరకు రుద్రూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ ఆందోళనలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ తారాబాయికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ వేతన సవరణ, సీపీఎస్ రద్దు, ఆరోగ్య భీమా వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న పంట క్షేత్రస్థాయి సందర్శన



- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధ్యం
- పెన్నా సీడ్స్ జోనల్ మేనేజర్ అప్సర్ అలీ సూచనలు

**వేద న్యూస్, దుగ్గొండి:**

నాణ్యమైన విత్తనాలను ఎంచుకుంటే రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా బలపడతారని పెన్నా సీడ్స్ జోనల్ మేనేజర్ మహమ్మద్ అప్సర్ అలీ తెలిపారు. దుగ్గొండి మండలం చాపలబండ గ్రామంలో పెన్నా సీడ్స్ 3422 మొక్కజొన్న పంటను కంపెనీ ప్రతినిధులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రకం మొక్కజొన్న అధిక దిగుబడితో పాటు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే సామర్థ్యం కలిగి ఉందన్నారు. గింజ నాణ్యత మెరుగ్గా ఉండడం వల్ల మార్కెట్లో మంచి ధర లభిస్తుందని, సరైన సాగు విధానాలు పాటిస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- న్యాయబద్ధమైన డిమాండ్లు వెంటనే అమలు చేయాలి
- ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాష్ట్రంలో ఉద్యోగులకు సంబంధించిన అనేక దీర్ఘకాలిక సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొన్ని సమస్యలు పరిష్కారం అయినప్పటికీ, ఇంకా అనేక సమస్యలు పరిష్కారం కాలేదని నాయకులు పేర్కొన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాలేదని విమర్శించారు. టీజీఈ జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వొడ్నాల రాజశేఖర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఆందోళనలు చేపట్టి ఆర్డీవోలు, తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. పీఆర్సీ అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఆరోగ్య కార్డుల అమలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, పెండింగ్ డీఏలు విడుదల, వీఆర్ఏల సమస్యల పరిష్కారం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత వంటి ప్రధాన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా కేవీకే జన్మదిన వేడుకలు




**వేద న్యూస్, కారేపల్లి:**

మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రివర్యుల వ్యక్తిగత సహాయకుడు కేవీకే రాఘవరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కారేపల్లి మండలానికి చెందిన యువజన నాయకులు దారావత్ రమేష్ నాయక్, జర్పులా ధోని ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శాలువాతో సన్మానం చేశారు. రాఘవరావు సేవలు మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తూ ఆయనను అభినందించారు. ప్రజాసేవలో నిరంతరం కృషి చేస్తున్న నాయకులకు తమ సహకారం కొనసాగుతుందని యువజన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# 5 నెలలుగా జీతాల్లేవ్..

- బతుకు భారంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు
- తక్షణ చెల్లింపులు చేయాలని డిమాండ్

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**



తెలంగాణలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు జీతాల ఆలస్యంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 వేల మంది ఉద్యోగులకు మూడు నుండి ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మాత శిశు సంరక్షణ, టిబి నిర్మూలన, రక్త బ్యాంక్, ఆయుష్ వంటి కీలక ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ జీతాలు ఆలస్యమవడం వల్ల కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. జీతాల బకాయిలను వెంటనే విడుదల చేసి, భవిష్యత్తులో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగ భద్రతతో పాటు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణపై అవమానకర వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించిన నాగరాజు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై లోక్‌సభలో జరిగిన చర్చలో కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం రాష్ట్ర భావజాలాన్ని అవమానించే చర్య అని ఆయన అన్నారు. లోక్‌సభ వేదికగా చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ సెంటిమెంట్‌ను దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. తేజస్వి సూర్య వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని నాగరాజు డిమాండ్ చేశారు.

# అమావాస్య సందర్భంగా గోమాతకు పూజలు

- వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గోసేవ కార్యక్రమం




**వేద న్యూస్, కరీంనగర్:**

అమావాస్య సందర్భంగా వాసవి క్లబ్ ఎమ్ఆర్ ఆధ్వర్యంలో "మా గోశాల క్లబ్ గోసేవ" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కరీంనగర్‌లోని కోతి రాంపూర్ గిద్ద పెరమాల్ల స్వామి ఆలయ గోశాలలో గోపూజ నిర్వహించి, గోవులకు దాణా అందజేశారు. అలాగే గోశాలను సంరక్షిస్తున్న గోసేవకునికి నగదు, వస్త్ర సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చిట్టుమల్ల సత్యనారాయణ, కార్యదర్శి ఎల్లంకి ప్రదీప్, కోశాధికారి పైడ రవి తదితరులు పాల్గొన్నారు. క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కొత్త ఇంట్లోనే విషాదం

- అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య

**వేద న్యూస్, బోయినపల్లి:**



అప్పుల బాధ తాళలేక వృద్ధుడు తన కొత్త ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బోయినపల్లి మండలం వరదవెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, వల్లంపట్ల ఎల్లయ్య (71) ఇటీవల కొత్త ఇల్లు నిర్మించుకోగా, ఖర్చుల వల్ల అప్పులపాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం తెల్లవారు జామున ఇంటి మెట్ల వద్ద ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నారు. మృతుడి కుమారుడు దుర్గయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎల్లయ్య మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

# సీపీఆర్‌పై అవగాహన సదస్సు

**- ప్రాణాలను కాపాడే నైపుణ్యం నేర్చుకోవాలి**



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ సీపీఆర్ ఎవరికి చేయాలి, ఎంతసేపు చేయాలి, దాని ప్రయోజనాలు వంటి అంశాలను ప్రజలకు వివరించారు. కమలాపూర్ ఇన్స్పెక్టర్ నవీన్, ఎస్సైలు దిలీప్, మధు, సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది, వైద్య సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

# వార్డు ప్రజలే మున్సిపల్ కార్మికులు!

**- డ్రైనేజీలు శుభ్రం చేసుకున్న స్థానికులు**



**వేద న్యూస్, హుజురాబాద్ రూరల్:**

పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనతతో వార్డు ప్రజలే మున్సిపల్ కార్మికుల్లా మారిన ఘటన హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. సమస్యలు పరిష్కారం కావడం లేదని విసిగిపోయిన స్థానికులు స్వయంగా డ్రైనేజీలను శుభ్రం చేసుకున్నారు. 75వ వార్డులో డ్రైనేజీలు పూడికతో నిండిపోవడంతో మురుగునీరు నిలిచి దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు కౌన్సిలర్‌కు వినతి చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. ఎన్నికల సమయంలో "వార్డును అద్దంలా తీర్చిదిద్దుతాం" అని హామీ ఇచ్చిన నాయకులు గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు "రేపు, మాపు" అంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. చేసేదేమీ లేక ప్రజలే తమ ఇళ్ల ముందు ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ప్రధానోపాధ్యాయురాలు పదవీ విరమణ సన్మాన సభ



**- గ్రామస్తుల భావోద్వేగ వీడ్కోలు**

**వేద న్యూస్, కారేపల్లి:**

అప్పాయిగూడెం పంచాయతీ భిక్య తండా ప్రభుత్వ పాఠశాలలో 11 సంవత్సరాలు సేవలందించిన ప్రధానోపాధ్యాయురాలు కర్నేటి సువర్ణ పదవీ విరమణ సందర్భంగా గ్రామస్థులు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని సువర్ణ దంపతులకు పూల వర్షంతో స్వాగతం పలికారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకుని తమ గురువుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ జయరాజ్ మాట్లాడుతూ, ఒకే గ్రామంలో 11 సంవత్సరాలు సేవలందించిన ఉపాధ్యాయురాలికి ఇంత ఘన సన్మానం జరగడం అరుదైన విషయం అని ప్రశంసించారు. ఉపాధ్యాయులు గ్రామస్తులతో సమన్వయంగా పనిచేస్తే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుతారని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత సువర్ణ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం ఉంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గ్రామంలో సేవ చేయడం తనకు మరిచిపోలేని అనుభవమని భావోద్వేగంగా చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, యువకులు తదితరులు పాల్గొన్నారు. పాటేమా నాగేంద్రబాబు పాటలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మొత్తంగా ఈ సన్మాన సభ గ్రామంలో గురువుల పట్ల ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తూ స్మరణీయంగా నిలిచింది.

# పిల్లల సృజనాత్మకతకు అంగన్వాడీలే బాట

**- పోషణ పక్షం సందర్భంగా గూడెం కేంద్రం సందర్శన**



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

పోషణ పక్షం కార్యక్రమాల సందర్భంగా సిరిసిల్ల ప్రాజెక్టు పరిధిలోని గూడెం అంగన్వాడీ కేంద్రాన్ని అధికారులు సందర్శించారు. చిన్నారులు ప్రదర్శించిన సృజనాత్మక కృత్యాలను పరిశీలించి అభినందించారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల సహజ ప్రతిభను వెలికితీసే వేదికలని తెలిపారు. ఒత్తిడి లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో ఆటలు, పాటలు, చేతిపనుల ద్వారా విద్య అందించడం వల్ల సమగ్ర వికాసం సాధ్యమవుతుందని వివరించారు. పిల్లల మేధో వికాసంలో తొలి 1000 రోజులు అత్యంత కీలకమని, ఈ దశలో ఆనందదాయకంగా విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, గ్రామ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎలా?



**- తాగునీటి కోసం నగరవాసుల తిప్పలు**
**- ప్రతిరోజు నల్లా నీరు అందించాలని డిమాండ్**
**- సీపీఐ నాయకుడు పైడిపల్లి రాజు**

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగరంలో తాగునీటి సమస్య తీవ్రమవుతోందని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు ఆందోళన వ్యక్తం చేశారు. నీటి సమస్యను పరిష్కరించాల్సిన మేయర్ నిర్లక్ష్యం సరికాదని విమర్శిం చారు. వేసవి ప్రారంభంతో ఎండలు పెరగడంతో మానేరు డ్యామ్‌లో నీటి కొరత ఏర్పడి, అనేక ప్రాంతాల్లో బోర్లు ఎండిపోతున్నాయని తెలిపారు. నగర పాలక సంస్థ సరఫరా చేసే నల్ల నీరు రెండు రోజులకు ఒకసారి కూడా సరిపడా అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కోతిరాంపూర్, కట్టారాంపూర్, హనుమాన్ నగర్, తిరుమల నగర్, అలకాపురి, పోచమ్మ వీధి, లక్ష్మీ నగర్, గణేష్ నగర్, భగత్ నగర్, రామచంద్రాపూర్, సప్తగిరి కాలనీల ప్రజలు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నీటి అవసరాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అవసరమైన చోట్ల వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మిడ్ మానేరు నుండి నీరు తరలించే అంశంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిరోజు కనీసం గంటపాటు ప్రతి ఇంటికి నీరు అందేలా ప్రణాళిక రూపొందించాలని, లేనిపక్షంలో ప్రజలు ఆందోళనలకు దిగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# తాగునీటి సమస్యతో వార్డు ప్రజల ఇబ్బందులు

**- బోరు మోటర్ మరమ్మతుల్లో ఆలస్యంపై ఆగ్రహం**



**వేద న్యూస్, గంభీరావుపేట:**

గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 2, 3 వార్డుల ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు మోటర్ కాలిపోవడంతో దాన్ని మరమ్మతులకు తరలించి 15 రోజులు గడిచినా పని పూర్తి కాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను వార్డు సభ్యులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన వార్డు సభ్యులు చిలుక ప్రశాంత్, ఎగదండి స్వామి బోరు ప్రెస్సింగ్ పనులు కూడా చేయాల్సి ఉండటంతో ఆలస్యం జరుగుతోందని తెలిపారు. ఈ సమస్యను ఈవో వినీల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొంటూ, త్వరలోనే పాలకవర్గ సమావేశం నిర్వహించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే తాగునీరు అందించడం తమ హక్కు అని పేర్కొంటూ, వెంటనే బోరు మోటర్ రిపేర్ చేసి నీటి సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతిభ జూనియర్ కాలేజీకి జిల్లా స్థాయి ర్యాంకులు

**- ప్రిన్సిపాల్ ఎండి షబ్బీర్‌ను సన్మానించిన డీఐఈఓ అంజయ్య**

**వేద న్యూస్, దేవరకద్ర/ఆత్మకూర్:**




2026 ఇంటర్ ఫలితాల్లో ఆత్మకూర్ శ్రీ ప్రతిభ వృత్తి విద్య (వొకేషనల్) మరియు పారామెడికల్ జూనియర్ కళాశాల విద్యార్థులు వరుసగా ఐదోసారి జిల్లా స్థాయి తొలి ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎండి షబ్బీర్‌ను వనపర్తి జిల్లా డీఐఈఓ అంజయ్య సన్మానించారు. మొదటి సంవత్సరం ఎంఫీహెచ్‌డబ్ల్యూ విభాగంలో శృతి (489/500), నవ్య (487/500), స్రవంతి (478/500), అర్చన (474/500), ఇందు (473/500) ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంఫీహెచ్‌డబ్ల్యూ విభాగంలో స్పందన (982/1000), మౌనిక (975/1000), మహిమ జ్యోతి (966/1000) ప్రతిభ కనబరిచారు. ఎంఎల్టీ ద్వితీయ సంవత్సరంలో అక్షయ, మాధవి ఇద్దరూ 973/1000 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను డీఐఈఓ అంజయ్య అభినందించి ఘనంగా సన్మానించారు.

# గోల్డెన్ అవర్ చాలా కీలకం

**- వైద్య సహాయం అందించి ప్రాణాలు కాపాడుదాం**
**- వైద్యాధికారి శిరీష**
**- సీపీఆర్‌పై అవగాహన**

**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి గోల్డెన్ అవర్ లో సరైన వైద్య సహాయం అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శిరీష తెలిపారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా చిన్నచింతకుంట ప్రభుత్వ ఆసుపత్రిలో గోల్డెన్ అవర్ రెస్పాన్స్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ ప్రాధాన్యతపై వివరించారు. గుండెపోటు సమయంలో గుండె స్పందన ఆగినప్పుడు సకాలంలో సీపీఆర్ చేయడం ద్వారా రక్త ప్రసరణను పునరుద్ధరించి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. అత్యవసర సమయంలో సమీపంలో ఉన్నవారు వెంటనే స్పందిస్తే బాధితుడు ప్రమాదం నుంచి బయటపడే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అదేవిధంగా ఎస్సై కృష్ణ ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనదారులకు లైసెన్స్, బీమా, హెల్మెట్ వినియోగం వంటి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, పోలీసు సిబ్బంది, డ్రైవర్లు, యువకులు పాల్గొన్నారు

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి




- సర్పంచ్ చిన్న వెంకట్

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్, ప్రధానోపాధ్యాయులు రాజన్న ఆధ్వర్యం లో మన పాఠశాల - మన భవిష్యత్ కార్యక్రమం నిర్వహించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని నాణ్యమైన విద్య లభిస్తుందని తల్లిదండ్రులకు సూచించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, నోటుబుక్కులు, రుచికరమైన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా బోధన జరుగుతుందని, రాబోయే విద్యా సంవత్సరంలో మెరుగైన అల్పాహారం కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అచ్చ విజయ్ భాస్కర్, హెడ్ మాస్టర్ రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

- మూడు చెక్కలపల్లిలో అగ్నిమాపక వారోత్సవాలు




**వేద న్యూస్, నల్లబెల్లి:**

మూడు చెక్కలపల్లి గ్రామంలో అగ్నిమాపక విభాగం వార్షికోత్సవాలను సర్పంచ్ సపావట్ కవిత దేవు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ భద్రతపై అవగాహన పెంచే లక్ష్యంతో కార్యక్రమం చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది గృహాల్లో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాద సమయంలో పాటించాల్సిన చర్యలను వివరించి ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫైర్ సబ్ ఇన్స్పెక్టర్ తేజావత్ మోహన్ రావు భద్రతా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మంజీలాల్, భూక్యా వెంకన్న, సురేష్, నరసింహులు సహా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరమని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సర్పంచ్ కవిత దేవు నాయక్‌ను అభినందించారు.

# క్రికెట్ టోర్నమెంట్‌కు రూ.5వేల ఆర్థిక సహాయం

- యువ క్రీడాకారులకు అండగా కొత్తపల్లి రవికిరణ్



**వేద న్యూస్, రుద్రూర్:**

నిజామాబాద్ జిల్లా స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిజామాబాద్ ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్) క్రికెట్ పోటీలకు రుద్రూర్ గ్రామ యువకులు ఎంపికయ్యారు. ఈ టోర్నమెంట్ ఎంట్రీ ఫీజు కోసం రుద్రూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొత్తపల్లి రవికిరణ్ రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులకు చెక్కు అందించారు. ఈ సందర్భంగా యువ క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు షేక్ ఇంతియాజ్, ప్రకాష్, క్రికెట్ జట్టు కెప్టెన్ జమీల్, పోలీసు సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ పిలుపు మేరకు ఉద్యోగులు మధ్యాహ్న విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1కు ముందు నియామకమైన వారికి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లులు, డీఏలు విడుదల చేయాలని, ఉద్యోగులకు ఆరోగ్య పథకం అమలు చేసి హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు క్లియర్ చేయడం, వీఆర్ఏల సమస్యలు పరిష్కరించడం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఖాదర్, సీనియర్ అసిస్టెంట్ రజిని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



- కన్నారావుపేటలో అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, నల్లబెల్లి:**

కన్నారావుపేట గ్రామంలో పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం సర్పంచ్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ హేమలత పాల్గొని బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరాన్ని వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా పిల్లల ఎదుగుదల మెరుగుపడి, రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లి, శిశు ఆరోగ్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ మూర్తి మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# ప్రపంచ వారసత్వ సంపదను కాపాడుకుందాం

- చారిత్రక కట్టడాల పరిరక్షణ
- సాంస్కృతిక వారసత్వ ప్రాముఖ్యత
- భావి తరాలకు అపురూప కానుకలు

**వేద న్యూస్ డెస్క్:**

మన పూర్వీకులు అందించిన అద్భుతమైన కట్టడాలు, కళలు మరియు సంస్కృతిని గౌరవిస్తూ వాటిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ఏప్రిల్ 18వ తేదీన ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని జరుపుకుంటాము. మానవ పరిణామ క్రమంలో నిర్మించబడిన అపురూపమైన కట్టడాలు కేవలం రాళ్లు, రప్పలు మాత్రమే కావు, అవి ఆనాటి సామాజిక స్థితిగతులకు మరియు సాంకేతిక నైపుణ్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆన్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ 1982లో ప్రతిపాదించిన ఈ దినోత్సవాన్ని యునెస్కో ఆమోదించినప్పటి నుండి ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి దేశం తన ప్రత్యేకతను చాటుకునే ఈ సందర్భంలో, మన వారసత్వ సంపద విలువను గుర్తించడం మరియు దానిని కలుషితం కాకుండా కాపాడటం మనందరి బాధ్యత అని ఈ దినోత్సవం గుర్తుచేస్తుంది.

భారతదేశం విషయానికి వస్తే, మన దేశం భిన్నత్వంలో ఏకత్వానికి మరియు అపారమైన చారిత్రక సంపదకు నెలవుగా ఉంది. అజంతా ఎల్లోరా గుహల నుండి మొదలుకొని దక్షిణాన ఉన్న తంజావూరు బృహదీశ్వరాలయం వరకు, ఉత్తరాన ఉన్న తాజ్ మహల్ నుండి పశ్చిమాన ఉన్న కోటల వరకు ప్రతి ఒక్కటీ ఒక అద్భుత కావ్యంలా దర్శనమిస్తాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని రామప్ప దేవాలయం మరియు వరంగల్ కోట వంటి కట్టడాలు మన శిల్పకళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాయి. ఇటువంటి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ప్రదేశాలను సందర్శించడం వల్ల మన చరిత్ర పట్ల అవగాహన పెరగడమే కాకుండా, పర్యాటక రంగం అభివృద్ధి చెంది ఆర్థికంగా కూడా దేశానికి మేలు కలుగుతుంది. వారసత్వ సంపద అనేది ఒక జాతి యొక్క అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. దురదృష్టవశాత్తు ప్రస్తుత ఆధునిక




కాలంలో కాలుష్యం, పట్టణీకరణ మరియు నిర్లక్ష్యం కారణంగా అనేక చారిత్రక ప్రదేశాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ప్రాచీన కట్టడాల గోడల మీద పేర్లు రాయడం, వ్యర్థాలను పారవేయడం వంటి పనులు మన సంస్కృతిని మనమే అవమానించుకున్నట్లు అవుతుంది. సహజ సిద్ధమైన విపత్తులతో పాటు మానవ తప్పిదాల వల్ల కూడా ఈ సంపద కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అందుకే ప్రభుత్వం తీసుకునే చర్యలతో పాటు సామాన్య ప్రజలలో కూడా మార్పు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. చారిత్రక కట్టడాల పరిరక్షణ అనేది కేవలం పురావస్తు శాఖ పని మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి నైతిక విధి అని మనం గుర్తించాలి.

వారసత్వ సంరక్షణలో భాగంగా స్థానిక సంస్థలు మరియు స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకం. మన చుట్టూ ఉన్న చిన్న చిన్న గుడులు, కోనేర్లు మరియు పురాతన కట్టడాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మనం ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావచ్చు. యునెస్కో గుర్తించిన ప్రాంతాలే కాకుండా, ప్రతి గ్రామంలోనూ ఏదో ఒక చారిత్రక నేపథ్యం ఉన్న ప్రదేశం ఉంటుంది. వాటిని గుర్తించి, వాటి చరిత్రను రికార్డు చేయడం ద్వారా స్థానిక సంస్కృతిని కాపాడుకోవచ్చు. అభివృద్ధి పేరుతో ప్రాచీన ఆనవాళ్లను కూల్చివేయకుండా, ఆధునికతను సంప్రదాయంతో మేళవించి ముందుకు సాగడం నేటి అవసరం.

విద్యార్థులు మరియు యువతలో ఈ వారసత్వ సంపద పట్ల మక్కువ పెంచడానికి పాఠశాల స్థాయి నుండే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. చారిత్రక ప్రదేశాలకు విహారయాత్రలు తీసుకెళ్లడం ద్వారా అక్కడి విశేషాలను వారికి వివరించాలి. సాంస్కృతిక వారసత్వం అంటే కేవలం భవనాలు మాత్రమే కాదు, మన భాష, జానపద కళలు, పండుగలు మరియు సంప్రదాయాలు కూడా అందులో భాగమేనని అర్థం చేసుకోవాలి. డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి ఈ కట్టడాల చరిత్రను నేటి తరానికి ఆకర్షణీయంగా వివరించడం ద్వారా వాటి పట్ల గౌరవాన్ని పెంపొందించవచ్చు. మన మూలాలను మనం మర్చిపోకుండా ఉండటమే నిజమైన అభివృద్ధికి నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు కూడా వారసత్వ కట్టడాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సముద్ర మట్టాలు పెరగడం, ఆమ్ల వర్షాలు మరియు ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గుల వల్ల పురాతన శిల్పాలు క్షీణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు మరియు పురావస్తు నిపుణులు అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ఈ కట్టడాలను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నారు. రసాయన పూతలు పూయడం మరియు లేజర్ క్లీనింగ్ వంటి పద్ధతుల ద్వారా శిల్పకళ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ పరిరక్షణ చర్యల్లో ప్రజల సహకారం ఉంటేనే ఆశించిన ఫలితాలు వస్తాయి.

పర్యాటక రంగం అభివృద్ధి చెందడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, కానీ అదే సమయంలో పర్యావరణ సమతుల్యతను కాపాడటం కూడా ముఖ్యం. పర్యాటక ప్రదేశాల వద్ద ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి మరియు పర్యాటకులకు బాధ్యతాయుతమైన ప్రవర్తనపై అవగాహన కల్పించాలి. స్థానిక హస్తకళలు మరియు కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతిని పర్యాటకులకు పరిచయం చేయవచ్చు. వారసత్వ సంపద రక్షణ అనేది కేవలం ఒక రోజు జరుపుకునే వేడుక కాదు, అది నిరంతర ప్రక్రియగా కొనసాగాలి. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మనం ఒక ప్రతిజ్ఞ చేద్దాం. మన పూర్వీకులు మనకు అప్పగించిన ఈ అపురూపమైన సంపదను ఎటువంటి నష్టం కలగకుండా జాగ్రత్తగా కాపాడుదాం. రేపటి తరం వారు కూడా ఈ అద్భుతాలను చూసి గర్వపడేలా వాటిని భద్రంగా అందిద్దాం. వారసత్వ సంపదను రక్షించుకోవడం అంటే మన చరిత్రను మనం గౌరవించుకోవడమే. ప్రపంచ పటంలో మన దేశ కీర్తిని పది కాలాల పాటు నిలబెట్టే ఈ కట్టడాలను సంరక్షించి, భావి తరాలకు మనం ఇచ్చే గొప్ప కానుకగా వీటిని మలుచుకుందాం. సంస్కృతిని కాపాడుకుందాం, చరిత్రను సగర్వంగా చాటుదాం.

వేద న్యూస్



# ఎల్లమ్మ దేవాలయానికి గ్రానైట్ విరాళం

- సీతారాంపల్లి ఎస్సి కాలనీలో సేవా కార్యక్రమం
- రూ.1 లక్ష విలువైన గ్రానైట్ అందజేత
- హరీష్ రావుకు ఆలయ నిర్వాహకుల కృతజ్ఞతలు



**వేద న్యూస్ సిద్దిపేట:**

సీతారాంపల్లి ఎస్సి కాలనీలోని ఎల్లమ్మ దేవాలయానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు గ్రానైట్ విరాళంగా అందించారు. దేవాలయ అభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ సహాయం చేసినట్లు తెలిపారు. రూ.1 లక్ష విలువ గల గ్రానైట్‌ను దేవాలయానికి పంపించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆలయ నిర్మాణ పనులు మరింత మెరుగ్గా కొనసాగేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు హరీష్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి ఆయన చేస్తున్న సహాయం అభినందనీయమని అన్నారు. ప్రాంతీయ ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు ముందుకు రావడం ఆనందకరమని స్థానికులు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. హరీష్ రావు ప్రజలతో అనుబంధం కొనసాగిస్తూ సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతున్నారని నాయకులు తెలిపారు. దేవాలయానికి అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ఈ విరాళం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో దేవాలయ నిర్మాణ పనులు వేగవంతం అవుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానికులు కూడా ఆయన సేవలను అభినందించారు.

# శంకరంపేట(ఏ)లో రోడ్డు భద్రతపై అవగాహన

- ప్రాణాపాయ స్థితిలో సీపీఆర్ పాత్రపై పోలీసుల డెమో
- అల్లాదుర్గ్ సీఐ రేణుక గారి ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం
- ఎన్‌హెచ్-161 మెడికల్ టీమ్ ద్వారా ప్రథమ చికిత్సపై అవగాహన
- రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని యాత్రికులు, ప్రజల ప్రతిజ్ఞ




**వేద న్యూస్ మెదక్ :**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా మెదక్ జిల్లా పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ముందడుగు వేశారు. శంకరంపేట (ఏ) మండల కేంద్రంలో అల్లాదుర్గ్ సీఐ శ్రీమతి ఎం. రేణుక గారు మరియు సర్కిల్ పరిధిలోని ఎస్ఐల ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి వాహనదారులు పాటించాల్సిన నియమ నిబంధనలపై ఈ సందర్భంగా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ప్రతి ప్రాణం విలువైనదని, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఈ సందర్భంగా పోలీసులు హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్-161 మెడికల్ టీమ్ సభ్యులు పాల్గొని అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు ఎలా కాపాడాలో ప్రత్యక్షంగా వివరించారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు అందించాల్సిన ప్రథమ చికిత్స గుండెపోటు వంటి సమయాల్లో ప్రాణదాతగా నిలిచే సీపీఆర్ ప్రక్రియపై లైవ్ డెమో ఇచ్చారు. ప్రమాద స్థలంలో సకాలంలో స్పందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చని మెడికల్ టీమ్ సభ్యులు ఉదాహరణలతో సహా వివరించారు. ఈ ప్రయోగాత్మక అవగాహన సదస్సు స్థానికులను మరియు వాహనదారులను ఎంతగానో ఆకట్టుకుంది.

రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతని సీఐ రేణుక గారు పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి చిన్నపాటి జాగ్రత్తలు పెద్ద ప్రమాదాల నుండి రక్షిస్తాయని చెప్పారు. ముఖ్యంగా యువత బైక్ రేసింగ్‌లకు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూనే, స్వీయ నియంత్రణతో ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించాలని ఆమె పిలుపునిచ్చారు.

కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారందరితో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. తాము ఎల్లప్పుడూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తామని, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తామని ప్రజలువిద్యార్థులు ప్రమాణం చేశారు. పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజల రక్షణ కోసం పనిచేస్తుందని, ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే సమాచారం అందించాలని అధికారులు కోరారు. 'అరైవ్ అలైవ్' నినాదాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రోన్ నిఘా, నిరంతర పెట్రోలింగ్‌తో పాటు ఇలాంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రమాదాల శాతాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రోడ్డు భద్రతపై పోలీసులు చూపుతున్న ఈ చొరవను శంకరంపేట ప్రజలు అభినందిస్తున్నారు. సాంకేతికతను మరియు మెడికల్ ఎక్స్‌పర్ట్స్‌ను జోడించి నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి మార్పు తీసుకువస్తుందని ఆశిస్తున్నారు. సురక్షిత ప్రయాణం – సుఖమయ జీవనం అనే నినాదంతో పోలీసులు ముందుకు సాగుతున్నారు.

# ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమానికి ఊతం

- ముదిగొండలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పర్యటన
- విద్యార్థుల పఠన నైపుణ్యాలపై సమీక్ష
- 100% రీడింగ్ లక్ష్యంతో ముందడుగు

**వేద న్యూస్ ఖమ్మం :**

ముదిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "ఎవ్రీ చైల్డ్ రీడ్స్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మమేకమై వారి పఠన నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థులు కథలు చదవడం, స్కిట్లు ప్రదర్శించడం, ఆత్మవిశ్వాసంతో పఠనం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనను అభినందించిన కలెక్టర్, ఈ కార్యక్రమం ద్వారా లక్ష్యాలు సాధ్యమవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ఒక గంట సమయం కేటాయించి పఠన నైపుణ్యాలను పెంపొందిస్తున్నారని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా కొనసాగించాలని సూచించారు.



స్వాతంత్ర్య దినోత్సవం నాటికి 100 శాతం పఠన నైపుణ్యాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, మెమెంటోలు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్య సాధనలో పెద్దపల్లి ముందంజలో ఉండాలి



**వేద న్యూస్ పెద్దపల్లి :**

- పఠన, రచన, గణిత నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి
- ఉపాధ్యాయుల వినూత్న బోధన పద్ధతులతో మెరుగైన ఫలితాలు
- ఎఫ్‌ఎల్‌ఎన్ ఛాంపియన్ పాఠశాలలకు ప్రశంసలు

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల భాషా, గణిత నైపుణ్యాల అభివృద్ధి కోసం ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసి పెద్దపల్లి జిల్లా ముందంజలో నిలవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం ఎంబీ గార్డెన్‌లో నిర్వహించిన ఎఫ్‌ఎల్‌ఎన్ జిల్లా కాన్క్లేవ్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ప్రొజెక్టర్ ద్వారా జిల్లా స్థాయి పురోగతిని విశ్లేషించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలను ఎఫ్‌ఎల్‌ఎన్ ఛాంపియన్ పాఠశాలలుగా ఎంపిక చేసి ప్రశంస పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు అనుసరిస్తున్న వినూత్న బోధన పద్ధతులను అభినందించారు. పఠన అవగాహన, రచనా నైపుణ్యం, గణితంలో గుణకం, భాగహారం వంటి అంశాలపై విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ పరీక్షల ఆధారంగా అభ్యాస స్థాయిని మెరుగుపరచాలని ఆదేశించారు. మండలాల వారీగా ఫలితాలను సమీక్షించి లోపాలు ఉన్న చోట ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించి ప్రతి విద్యార్థి ప్రాథమిక నైపుణ్యాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జి. శారద, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ షేక్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

**వేద న్యూస్ పెద్దపల్లి :**



- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ఓపీ సమయం ముగిసినా వైద్యులు ఆసుపత్రిలోనే ఉండాలని ఆదేశం
- అవసరం లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయరాదని హెచ్చరిక
- మూడు నెలల మందుల స్టాక్ సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచన

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గోదావరిఖని జనరల్ ఆసుపత్రి పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఓపీ సమయం ముగిసిన తర్వాత కూడా వైద్యులు ఆసుపత్రిని వదిలి వెళ్ళకూడదని, మధ్యాహ్నం 12 గంటల తర్వాత వైద్యులు అందుబాటులో లేరనే ఫిర్యాదులు రాకూడదని ఆయన గట్టిగా హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని రోజువారీ ఓపీ వివరాలను సమీక్షిస్తూ రోగుల సంఖ్య తగ్గుతున్న అంశంపై ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ విధానంలో తక్షణమే భర్తీ చేయాలని ఆదేశించారు. ఏ రోగి కూడా సరైన వైద్యం అందక వెనుదిరగకూడదని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలకు పూర్తిస్థాయిలో చేరవేయాలని సూచించారు. వైద్యుల కొరత వల్ల సేవలలో అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రిలో క్రమశిక్షణతో కూడిన పనితీరు ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులను అనవసరంగా ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే సమాచారంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే అన్ని రకాల వైద్య సేవలు అందేలా చూడాలని, రోగులను ప్రైవేట్ సంస్థలకు పంపే ధోరణిని మానుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఏదైనా వైద్య పరికరం అందుబాటులో లేనప్పుడు లేదా కేసులు ఎక్కువగా వస్తున్నప్పుడు వెంటనే ప్రతిపాదనలు పంపాలని, తద్వారా కొత్త పరికరాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా వైద్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మందుల సరఫరా స్టాక్ నిర్వహణపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ స్టాక్‌లో లేని మందుల జాబితాను సిద్ధం చేయాలని, జిల్లా నిధులతో కనీసం మూడు నెలలకు సరిపడా మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఔషధాల కొరత కారణంగా రోగులు బయట మందులు కొనుగోలు చేసే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. వైద్య పరీక్షల కోసం అవసరమైన సామగ్రిని ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, యంత్రాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. రోగులకు మెరుగైన వసతుల కోసం కొత్త ఏసీలు సెక్యూరిటీ గార్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. అత్యవసర కేసుల్లో రోగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందికి అదనంగా అవసరమైన వారిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించి, మూడు షిఫ్టుల్లో పనులు పక్కాగా జరిగేలా పర్యవేక్షించాలని చెప్పారు. ఆసుపత్రి ప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూడాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డాక్టర్ కృపా బాయ్, డాక్టర్ రాజు, డాక్టర్ ప్రసాద్ మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఆసుపత్రి యంత్రాంగం తమ పనితీరును మెరుగుపరుచుకునే దిశగా చర్యలు ప్రారంభించింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073